క్లుప్తంగా

ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కంటి వైద్యశిబిరం



తెనాలిఅర్బన్: వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల వ్యవస్థాపకులు నన్నపనేని వెంకట్రావు వర్థంతిని పురస్కరించుకుని మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పలువురు కంటి వైద్యులు విద్యార్థులు, అధ్యాపకులకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ఏవో డాక్టర్ సుగుణ, కళాశాల ప్రిన్సిపల్ అజయ్, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ వెంకట పవన్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలిఅర్బన్: ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గుంటూరు జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ రవికాంత్ శనివారం ఆవిష్కరించారు. గుంటూరులోని డీపీటీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం అధ్యక్షురాలు పారే లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు ధనలక్ష్మి, శివపార్వతి, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నాయకులు పి.సుధీర్‌కుమార్, ఎస్.నాగమోహన్, సుబ్బారావు పాల్గొన్నారు.

తాడేపల్లి తహసీల్దార్‌కు అవార్డు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్యకు ఎన్నికల సంఘం నుంచి అవార్డు లభించింది. శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఏపీ చీఫ్ సెక్రటరీ కె.విజయేంద్ర చేతుల మీదుగా బెస్ట్ అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌గా అవార్డును అందుకున్నారు. రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యల సర్వే



ఫిరంగిపురం: కార్మిక సర్వే బృంద సభ్యులు బేతపూడిలోని చైతన్య నగర్, మాలదాసుల కాలనీ, గుండాల పాడులోని దాసుల కాలనీలో శనివారం ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు ప్రజలు వివరించారు. కొన్ని ఇళ్లకు ఇంత వరకు పట్టాలు ఇవ్వలేదని చెప్పారు. సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సర్వే బృంద సభ్యులు తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి మస్తాన్‌వలి ఉన్నారు.

పశు వైద్య శిబిరం ప్రారంభం



ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు, శిరంగిపాలెం గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు శనివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎం.రోశయ్య, చేవూరి.రామమోహన్‌రెడ్డి, అంచుల శంకరరావు ప్రారంభించారు. 70 పశువులకు పశు వైద్యాధికారి పీర్ అహ్మద్ పరీక్షలు చేసి, నట్టల నివారణ మందు వేశారు. శిరంగిపాలెంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో 40 దూడలకు నట్టల నివారణ మందును ఎల్ఎస్ఏ ఆర్‌వీ వినీల అందజేశారు. 15 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు, 10 గేదెలకు చూడి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. 40 దూడలకు నట్టల నివారణ మందు వేసినట్లు ఆమె తెలిపారు.

వీటి గతి ఇంతేనా?

- థాణాల్లో పేరుకుపోతున్న వాహనాలు
- వివిధ కేసుల్లో పోలీస్ స్టేషన్లలో ఉండిపోయిన పలు వాహనాలు
- తొమ్మిదేళ్లుగా జరగని వేలం



వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద..

తెనాలిరూరల్: కేసుల్లో ఉన్న వాహనాలు పోలీస్ స్టేషన్లలో ఏళ్ల తరబడి ఉండిపోతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, హత్యలు వంటి వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు ఆయా స్టేషన్లలో కుప్పలుగా పేరుకుపోతున్నాయి. ఎండకు ఎండి, వానకు తడిచి వాహనాలు పనికిరాకుండా పోతున్నాయి. ఇలా స్టేషన్లలో పేరుకుపోయిన వాహనాలను 2016లో వేలం వేశారు. వాహనాలను వినియోగించడానికి వీల్లేదని, కేవలం స్క్రాప్ కింద కొనుగోలు చేసుకుని విక్రయించుకోవాలని అప్పట్లో పోలీసు అధికారులు తెలిపారు.

తొమ్మిదేళ్లు గడచినా ఇప్పటికీ వాహనాల విక్రయం ఊసే లేదు. ఇలా వాహనాలు పేరుకుపోతుండడంతో ఆయా స్టేషన్ల ఆవరణాలతో పాటు పక్కన ఉన్న కార్యాలయాలు, కోర్టు ఆవరణలను సైతం ఇటువంటి వాహనాలను నిలపడానికి వినియోగించాల్సి వస్తోంది. తెనాలి వన్ టౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన వాహనాలను రెండు అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట ఉంచుతున్నారు. టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌వాహనాలను స్టేషన్, సిబ్బంది క్వార్టర్ల మధ్య ఉంచుతున్నారు. త్రీ టౌన్ స్టేషన్‌కు పడమర వైపున ఉన్న ఆవరణలో ఉంచుతున్నారు. ఆయా స్టేషన్లలో కొన్ని వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దాదాపు వాహనాలను వేలం వేసి దశాబ్దం కావడంతో ఇప్పటికైనా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటారేమో చూడాల్సిన అవసరం ఉంది.



టూ టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద..



త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద...

సీసీఆర్‌సీ కార్డులున్నా బ్యాంకు రుణాల ఊసే లేదు

రైతుసంఘం నేతల సర్వేలో దళితుల ఆవేదన



సర్వే చేస్తున్న రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

తెనాలి: సొసైటీ భూమికి పట్టాలు, పాస్‌బుక్‌లు లేవనీ, సీసీఆర్‌సీ కార్డులు 80 మందికి ఉన్నప్పటికీ బ్యాంకు రుణాల ఊసే లేదని రూరల్ మండల గ్రామం గుడివాడ గ్రామానికి చెందిన పలువురు దళితులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, తెనాలి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం దళితవాడలో సర్వే జరిపారు. హాఫ్‌పేట సొసైటీలో గుడివాడ దళితులకు 40 ఎకరాల భూమి ఉందని, అయినా ప్రభుత్వం పట్టాలు, పట్టాదారు పుస్తకాలు ఇవ్వలేదని వారు తెలియజేశారు. రెండు పల్లెల్లోని 150 మంది కౌలురైతుల్లో 80 మందికి కౌలురైతు కార్డులు ఉన్నప్పటికీ బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు, పరిహారాలకు నోచుకోలేదన్నారు. ఎకరాకు ధాన్యం కౌలు 22–25 బస్తాలు, నగదు అయితే రూ.35–40 వేలుగా ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం సొసైటీ భూములకు రూ.7,500 ఇచ్చిందనీ, ఈ ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందా అని ఎదురుచూస్తున్నామని చెప్పారు. గ్రామంలో దళితులకు గల శ్మశాన స్థలం 80 సెంట్ల విస్తీర్ణంలో ఉందనీ, అది పూర్తిగా నిండిపోయిందనీ, మరికొంత స్థలం మంజూరు చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఉపాధిహామీ పనుల విషయానికొస్తే 470 మందికి జాబ్‌కార్డులు ఉన్నాగానీ, కేవలం 30–40 కుటుంబాలకే 100 రోజుల పనిదినాలు దొరుకుతున్నాయని గ్రామంలోని వారు చెప్పారు. గతంలో రూ.25 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మించినా నిరుపయోగంగా ఉందన్నారు. నీటికోసం రోజుకు రూ.6,750 ఖర్చు చేయాల్సివస్తోందని తెలిపారు. సర్వే జరిపినవారిలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, ముద్దన సాంబశివరావు, జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్, బి.శేషయ్య, ఇశ్రాయిల్, దేవసహాయం పాల్గొన్నారు.

పిల్లల పెంపకంపై తల్లిదండ్రులు దృష్టి పెట్టండి

వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు

తెనాలిఅర్బన్: పిల్లల పెంపకంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో శనివారం పిల్లల పెంపకం– తల్లిదండ్రుల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండేదని, అది అంతరించిపోతూ వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్న సమయంలో ప్రతి ఒక్కరిపై పెద్దల అజమాయిషీ ఉండేదన్నారు.

నేడు ఆ పరిస్థితి లేదన్నారు. పిల్లలు ఒకచోట, తల్లిదండ్రులు ఒకచోట జీవించడం వలన ధన సముపార్జన కోసం వివిధ ప్రాంతాల్లో, దేశాల్లో నివాసించడం వలన పిల్లలపై పెద్దల అజమాయిషీ పోయిందన్నారు. తల్లిదండ్రులు పిల్లల కదలికలను గమనించడంతో పాటు వారి కోసం కొంత సమయం కేటాయించాలని సూచించారు. సమావేశంలో కరస్పాండెంట్ లీసా జార్జ్, ప్రిన్సిపల్ సిస్టర్ సౌమ్య, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

27,28 తేదీల్లో తెనాలిలో వాలీబాల్ పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సుధాకర్, డాక్టర్ రవీంద్రనాథ్

తెనాలిఅర్బన్: నన్నపనేని వెంకట్రావు స్మారక వాలీబాల్ పోటీలను ఈ నెల 27,28 తేదీలలో నిర్వహించనున్నట్లు వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ తెలిపారు. టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలను శనివారం కళాశాల ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్–17 బాలుర విభాగంలో పోటీలు జరుగుతాయని చెప్పారు. 8,9,10 చదువుతున్న బాలురు పోటీలకు అర్హులన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని కలిగించేందుకు పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కళాశాల ఆవరణలో జరిగే పోటీల్లో పాల్గొనదలచిన వారు సెల్‌నెంబర్ 94905 73851, 88860 22933 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ అజయ్, వ్యాయామ అధ్యాపకులు గాంధీ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం ఓటు



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న, ప్రక్కన తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిలో 2కె రన్

తెనాలిఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణలు పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం నుంచి వైకుంఠపురం వరకు శనివారం టుకె రన్‌ను నిర్వహించారు. విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎన్‌సీసీ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

28న తెనాలిలో విద్యుత్ అదాలత్

తెనాలిరూరల్: విజయవాడ కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన విద్యుత్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు విద్యుత్‌శాఖ తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి వర్ బ్రిడ్జి వెంబడి ఉన్న ఎస్ఎల్ఎస్ ఫంక్షన్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే అదాలత్‌లో సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎన్. విక్టర్ ఇమ్మానియేల్, ఫోరం సభ్యులు, విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారని, వినియోగదారులు తమ సమస్యలను పూర్తి కన్స్యూమర్ నంబరు, సెల్ నంబర్లతో లిఖితపూర్వకంగా అర్జీలను అందజేయవచ్చని తెలిపారు.

నేడు జాబ్ మేళా

తెనాలిరూరల్: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో గుంటూరు మాజీ ఎంపీ గల్లా జయదేవ్ అమరరాజ గ్రూప్ సౌజన్యంతో ఆదివారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ఎస్ఆర్ఐ కాలేజీ ప్రాంగణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగే జాబ్ మేళాలో పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ వారికి రెండు సంవత్సరాలు ట్రైనింగ్ ఇచ్చి ఆ కాలంలో రూ.12,000 జీతం, భోజన వసతి, ఇంటర్ విద్యార్హత కలిగిన వారికి 18 నెలలు శిక్షణ కాలంలో రూ.12,600 వరకు జీతం భోజన వసతి కల్పిస్తారు. అదే విధంగా ఐటీఐ, పాలిటెక్నిక్ చేసి అప్రెంటిస్ చేసిన వారిని నేరుగా ఉద్యగంలోకి తీసుకుని సుమారు రూ. 20 వేల జీతంతో ఉద్యోగం కల్పిస్తారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు నేరుగా హాజరుకావచ్చు.

కాలువ కట్టలపై నిర్మాణాల తొలగింపు

తాడేపల్లిరూరల్: కాలువ కట్టలపై పేదలు వేసుకున్న నిర్మాణాలను కూల్చివేయడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు, బాధితుడు హరిబాబు గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటంలో బకింగ్‌హామ్ కెనాల్ కట్టపై ఉన్న హరిబాబుకు చెందిన పశువుల పాకని ఇరిగేషన్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా హరిబాబు గౌడ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. మంత్రి నారా లోకేష్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలవగట్ల మీద నివాసముండే వారికి పట్టాలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన అవసరం

జాతీయ ఓటరు దినోత్సవంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్



ప్రసంగిస్తున్న జడ్జి ఎ.పవన్‌కుమార్

తెనాలి: ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటుహక్కు ప్రాధాన్యతను అందరూ తెలుసుకోవాలని పట్టణానికి చెందిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి పవన్‌కుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, గతంలో ఓటుహక్కు 21 ఏళ్ల వయస్కులకే కల్పించే వారని గుర్తుచేశారు. తర్వాతి కాలంలో 18 ఏళ్ల వయసు యువతకు కూడా మెచ్యూరిటీ స్థాయిలు ఎక్కువగా ఉంటాయన్న భావనతో ఇప్పుడు 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కును కల్పిస్తున్నట్టు చెప్పారు. ఓటు హక్కు గల ప్రతివారూ ఎన్నికల సమయంలో తప్పనిసరిగా ఓటు వేసి, మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాల్సి ఉందని చెప్పారు. ఈలోపు వయసు కలిగిన బాలబాలికలు కూడా ఓటు హక్కు, ప్రజాస్వామ్యం వంటి అంశాలపై అవగాహన కలిగించుకోవాలని సూచించారు. అధ్యక్షత వహించిన ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సమావేశంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు ఓటు హక్కు, ప్రజాస్వామ్యంతో సహా వివిధ అంశాలపై ప్రశ్నలడిగారు. చక్కగా జవాబు చెప్పిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఇదే సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన బాలబాలికలకు బహుమతులు, ఉదయం మునిసిపల్ కార్యాలయం నుంచి వైకుంఠపురం వరకు నిర్వహించిన 2కే వాక్‌లో విజేతలైన ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలకు షూస్, అవార్డులు బహూకరించారు. ఓటు హక్కు వినియోగించుకుంటున్న వయోవృద్ధులను సత్కరించారు. వేదికపై మండల తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ ఉన్నారు. తొలుత సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి కళాక్షేత్రం వరకు ర్యాలీగా వచ్చారు.

ఏడు అడుగుల రాజ్యాంగం పుస్తకావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాలతో రాజ్యాంగం, కలం ఆవిష్కరణ

తెనాలి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కంచర్లపలెం శివారులోని కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఫైబర్‌తో చేసిన ఏడు అడుగుల రాజ్యాంగం పుస్తకాన్ని, స్టెయిన్‌లెస్ స్టీలుతో రూపొందించిన 13 అడుగుల పెన్నును అక్కడి అంబేడ్కర్ విగ్రహాల ప్రదర్శనలో ఏర్పాటుచేశారు. వీటి ప్రదర్శనను శనివారం సాయంత్రం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కె.గంగాధరరావు, దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ఆవిష్కరించారు. ప్రపంచ మేధావుల్లో ఒకరైన బాబాసాహెబ్ అంబేడ్కర్, ఆయన రచించిన రాజ్యాంగం, ఉపయోగించిన కలం, విగ్రహాలతో సహబూ ఒకేచోట ఉండటం తొలిసారిగా చూస్తున్నామని గంగాధరరావు అన్నారు. వీటిని రూపొందించిన శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షలను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా బుద్ధుడు తర్వాత అత్యధికంగా ఉన్నవి అంబేడ్కర్ విగ్రహాలు మాత్రమేనని ఆచార్య కృపాచారి అన్నారు. అంటువంటి అంబేడ్కర్ విగ్రహాలు అత్యధికంగా ఒకేచోట కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించటం గొప్ప విశేషమన్నారు. విగ్రహాలతోపాటు రాజ్యాంగం, పెన్నును కూడా ప్రదర్శించటం అబ్బురంగా ఉందన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ పొన్నెకంటి రత్నాకర్, సహజకవి అయినాల మల్లేశ్వరరావు మాట్లాడారు. విశ్వగురు వరల్డ్ రికార్డ్, మిరాకిల్ వరల్డ్ రికార్డుల ప్రతినిధి, టాలెంట్ ఎక్స్‌ప్రెస్ రికార్డ్ నిర్వాహకుడు కనపర్తి రత్నాకర్ ప్రత్యేక అతిథిగా హాజరై, ఆ మూడు రికార్డులను కాటూరి ఆర్ట్ గ్యాలరీకి అందిస్తామని ప్రకటించారు.

నేడు సంతాన సాఫల్యతపై ఉచిత వైద్యశిబిరం



కరపత్రాన్ని ఆవిష్కరించిన రోటరీ బాధ్యులు

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ, విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత సంతానోత్పత్తి వైద్య శిబిరాన్ని ఆదివారం తెనాలిలో నిర్వహించనున్నారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ రోడ్డులోనిబెస్ట్ డయాగ్నస్టిక్ భవనంపై గల రోటరీ కార్యాలయంలో శనివారం సాయంత్రం సంబంధిత కరపత్రాన్ని రోటరీ క్లబ్ బాధ్యులు ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. రోటరీ కార్యాలయంలో ఆరోజు ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. వివాహమై చాలా కాలం సంతానం కలగనివారు, మొదటి సంతానం కలిగి రెండో సంతానానికి బాగా ఆలస్యమైన వారు ఈ శిబిరానికి విచ్చేసి వారి సమస్యను సంతాన ఉత్పత్తి నిపుణులైన డాక్టర్ వై.స్వప్నచే పరీక్షించుకుని సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. కరపత్రం ఆవిష్కరణలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర శ్రీనివాసరావు, దేవయజనం మురళీకృష్ణ, కన్నెగంటి మురళీకృష్ణ, ఈదర వెంకటపూర్ణచంద్, చేతన్‌రాజ్ కొఠారి, కాకుమాను ఉపేంద్ర, ఆలపాటి కిరణ్‌చౌదరి, రాజశేఖర్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సక్రమంగా వినియోగించాలి

తహసీల్దారు సిద్ధార్థ



బహుమతులు అందజేస్తున్న తహసీల్దారు సిద్ధార్థ

కొల్లిపర: ఓటు హక్కు సక్రమ వినియోగంతో సుపరిపాలన సాధ్యమని తహసీల్దారు జి.సిద్ధార్థ అన్నారు.రెవిన్యూశాఖ ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందడంతో పాటు, ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి వి.ప్రతాపరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు ఉప్పాల రాజేష్, ఎంఈవో సాల్మాన్ రాజ్, ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్‌వోలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం అమలుతోనే ప్రజాస్వామ్యానికి మనుగడ

సదస్సులో ప్రముఖ సామాజిక కార్యకర్త గడియారం భార్గవ



మాట్లాడుతున్న భార్గవ

తెనాలి: రాజ్యాంగం అమలులో విలువలు తగ్గిపోతే ప్రజాస్వామ్యం మనుగడ కష్టసాధ్యమని ప్రముఖ సామాజిక కార్యకర్త గడియారం భార్గవ అన్నారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో 'రాజ్యాంగాన్ని కాపాడండి... ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. తుమ్మెల్ల శ్యాంషా అధ్యక్షత వహించారు. ప్రధాన వక్త గడియారం భార్గవ మాట్లాడుతూ రాజ్యాంగం పుట్టుకతో సహా వివిధ దేశాల్లోని లిఖిత రాజ్యాంగాలను వివరించారు. ప్రభుత్వాలు రాజ్యాంగం/చట్టాలకు వ్యతిరేకంగా ఏవైనా నిర్ణయాలు తీసుకుంటే, ఎదుర్కొనే శక్తి ప్రజలకు లేదన్నారు. ఒకవేళ రిఫరెండమ్ పెట్టినా ప్రభుత్వ వాదనే గెలుస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రజలు 10,11 శతాబ్దాల నాటి ఆచరణను కలిగివుండటమే ఇందుకు కారణంగా చెప్పారు. ప్రభుత్వాలు రాజ్యాంగ విలువలకు లోబడి పనిచేసేలా నియంత్రించాల్సింది సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ వంటి స్వతంత్ర్య సంస్థలేనని చెప్పారు. దేశంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఆయా వ్యవస్థలను కూడా నీరుగారిస్తే ప్రజాస్వామ్యం అనే మాటకు అర్థం ఉండదన్నారు. న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు, కుంచకర కోటేశ్వరరావు, మోపిదేవి ఫణిరామ్‌దేవ్ మాట్లాడారు. సభికుల ప్రశ్నలకు గడియారం భార్గవ సమాధానాలిచ్చారు.

వేస్ట్ పికర్స్ స్థితిగతుల పరిశీలన



వేస్ట్ పికర్స్‌తో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ శకుంతల

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో రోడ్ల వెంబడి చిత్తు పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులు సేకరించి జీవించే (వేస్ట్ పికర్స్ కమ్యూనిటీ) వారి జీవితాలు మెరుగుపరచాలని డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వారి విజ్ఞప్తి మేరకు శనివారం ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల వడ్డేశ్వరం విచ్చేసి వేస్ట్ పిక్కర్స్ కుటుంబాల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. డీబీఆర్‌సీ కో–ఆర్డినేటర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఇక్కడ నివసించే వారికి ఆధార్, రేషన్ కార్డులు లేవని, ఇళ్ల స్థలం, విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. కుటుంబాల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని అడిషన్ కమిషనర్ శకుంతల పేర్కొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

నాక్కయింటు అయిన తటవర్తి మాలకొండయ్య తండ్రి: మాధవరావు, వయస్సు 25 సం||లు, డోర్ నెం.14-4-106, మారీసుపేట, తెనాలి, గుంటూరు జిల్లా నివాసికి సంబంధించిన తెనాలిలోని గణేష్‌విల్లా రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ 2వ ఫ్లోర్ ఫ్లాట్ నెం.1 ఎస్ఆర్‌ఓ తెనాలి లో రిజిస్టర్ కాబడిన ఒరిజినల్ దస్తావేజు నెం. 3820/2021 గల డాక్యుమెంట్ జెరాక్స్ నిమిత్తం ఇంటిదగ్గర నుండి వెళ్లేదగా దారిలో పోయినవి. ఎంతవెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల తెలియజేయగలరు.
ఎం. మాణిక్యరావు, అడ్వకేట్
తటవర్తి మాలకొండయ్య – 8106332589